క్లుప్తంగా

కెరీర్ కౌన్సెలింగ్‌పై అవగాహన

ఖమ్మంరూరల్: మండలంలోని కోదాడక్రాస్ రోడ్‌లో గల గురుకుల డిగ్రీ కళాశాలలో శుక్రవారం విద్యార్థినులకు కెరీర్ కౌన్సెలింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హిప్నోథెరపిస్ట్ అండ్ హెచ్ఆర్డీ ట్రైనర్ డాక్టర్ క్రాంతికర్ విద్యార్థులు తమ సామర్థ్యాన్ని ఏవిధంగా పెంపొందించుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఎంచుకున్న రంగాలలో వారి నైపుణ్యాలను ఎలా పెంచుకోవాలో వివరించారు.జీవితంలో ఏదైనా సాధించాలంటే ఏకాగ్రత, సంకల్పం ఉండాలని తద్వారా లక్ష్యం నెరవేరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి. ఝాన్సీరాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తలకు పరామర్శ

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెంలో గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలపై బీఆర్ఎస్ నాయకులు జరిపిన దాడిలో గాయపడ్డ పలువురిని యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు రాంరెడ్డి చరణ్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. కూసుమంచి పోలీస్‌స్టేషన్‌లో ఉన్న వారిని ఆయన కలుసుకుని ధైర్యం చెప్పారు. ఓటమి భయంతోనే బీఆర్ఎస్ వాళ్లు దాడులకు పాల్పడ్డారని అన్నారు. పార్టీ కార్యకర్తలకు తాము అందరం అండగా ఉంటామని, అధైర్యపడొద్దని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండీ హఫీజుద్దీన్, గొల్లపూడి వీరన్న, దాసరోజు వెంకన్న, కనకం మైసయ్య, బొంగా నాయక్, మీరా తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఓటరుకు కృతజ్ఞతలు

నేలకొండపల్లి: అసెంబ్లీ ఎన్నికలలో ఓటింగ్ శాతం పెంచేందుకు కృషి చేసిన ప్రతీ ఒక్కరికి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేశ్ కృతజ్ఞతలు తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలేరు నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, 3వ తేదీన సంబరాలు చేసేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సూచించారు.

చెడు అలవాట్లకు బానిస కావొద్దు

ఖమ్మంలీగల్: విద్యార్థులు చదువుకునే దశలో చదువుపైనే దృష్టి కేంద్రీకరించాలి కానీ చెడు వ్యసనాలకు బానిస కావొద్దని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మామిడి హనుమంతరావు అన్నారు. శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన స్థానిక షెడ్యూలు కులాల వసతి గృహ విద్యార్థులకు న్యాయ చైతన్య సదస్సు నిర్వహించి విద్యార్థులకు న్యాయ సేవాధికార సంస్థ చట్టంతో పాటు ఇతర పలు చట్టాలను వివరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రపంచ ఎయిడ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ ఎటువంటి చెడు అలవాట్లకు బానిసలు కామని ప్రతిన పూనాలని పిలుపునిచ్చారు. హెచ్ఐవీ ఎయిడ్స్ బాధితులు ఎవరికైనా ఉచిత న్యాయ సహాయం అవసరమైనట్లయితే ఖమ్మం జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి ఉచిత న్యాయసహాయం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ వెంకటరెడ్డి, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	యానిమల్
వినోద	యానిమల్
సాయిరాం	అధర్వ
ఆదిత్య	ఆది కేశవ
శ్రీనివాస	కలింగ్ సహస్ర

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	30	బచ్చలికూర	3
వంకాయ	40		10
బెండకాయ	46	పాలకూర	3
పచ్చిమిర్చి	34		20
కాకర	40	చుక్కకూర	3
బోడ కాకర	100		20
బీర	50	తోటకూర	3
దొండ	34		10
పొట్లకాయ	30	గోంగూర	2
చిక్కుడు	66		10
గోరుచిక్కుడు	46	మెంతికూర	2
క్యాబేజీ	18		10
క్యాలీఫ్లవర్	25	కొత్తిమీర	1
ఆలుగడ్డ	30		30
చామగడ్డ	40	పుదీన	1
క్యారెట్	46		20
క్యాప్సికం	56	-ఖమ్మం వ్యవసాయం	



ఎర్రబారిన పత్తి పైరు

ఆశలు.. ఆవిరి!

అన్నదాతలకు తెల్ల బంగారం దెబ్బ

- ఫైరు ఎర్రబారి తగ్గిన దిగుబడి
- పెట్టుబడి కూడా వచ్చేలా లేవంటున్న వైనం
- మార్కెట్‌లోనూ పడిపోయిన పత్తి ధర
- మండలంలో సుమారు 11,596 ఎకరాల్లో సాగు

కామేపల్లి: ఖరీఫ్ సీజన్‌లో పత్తి సాగు చేసిన రైతులకు ఈ ఏడాది నిరాశే మిగిలింది. పత్తి పంటను సాగు చేసిన నాటి నుంచి వాతావరణం అనుకూలించకపోవడంతో పూతకాత సరిగా రాలేదు. దీనికి తోడు వర్షాలు సకాలంలో కురవకపోవడంతో పత్తి మొక్కల ఎదుగుదల ఆగిపోయింది. పండిన పంటకు కూడా మార్కెట్‌లో సరైన ధర లేదు. ఇలా అన్ని విధాలా పత్తి రైతులకు దెబ్బ మీద దెబ్బ తగిలింది. పత్తి సాగు ఆశాజనకంగా లేకపోవడంతో పత్తి పంటపై వచ్చే రాబడిని రైతులు వదులుకున్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితులు లేకపోవడంతో దున్ని ఏమైనా ఆపరాలు సాగు చేద్దామనుకుంటే సాగు నీరు లేకపోవడంతో పత్తి సాగు రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. పత్తి సాగుకు వేల రూపాయలు పెట్టుబడి పెట్టినా కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనబడడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. మండలంలో సుమారు 11,596 వేల ఎకరాల్లో పత్తి సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. కాగా, ఒక్కో ఎకరానికి రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టగా.. ఎకరాకు మూడు నుంచి ఆరు క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చే పరిస్థితి ఉందని రైతులు అంటున్నారు.

అధిక ఖర్చు.. రాబడి శూన్యం..

పత్తి సాగు చేసిన రైతులు పత్తి ఏటా ఎకరాకు 12 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. కానీ ఈ ఏడాది ఆ పరిస్థితి కనిపించడంలేదు. ఐదు నుంచి ఎనిమిది క్వింటాళ్లలోపే దిగుబడి వచ్చే ఆవకాశం ఉంది. ధరలో వ్యత్యాసం గతంలో క్వింటా పత్తి రూ.8 వేల పైచిలుకు ఉండేది. పెట్టిన పెట్టుబడి పోనూ ఎంతో కొంత మిగిలేవి. వర్షాలకు దెబ్బతినకుండా ఉండాలని ఎక్కువగా బోదె పత్తిని సాగు చేశారు. దీనికి ట్రాక్టర్‌కు ఎకరాకు రూ.2 వేల చొప్పున అదనంగా ఖర్చు వచ్చింది. వర్షాలు అధికంగా లేకపోవడంతో ఇప్పుడు ఆ పత్తి పంట ఎర్రబారింది. పండిన పత్తిని కూలీల చేత తీసినందుకు కేజీకి సుమారు రూ.12 నుంచి రూ.15 మధ్య ఇవ్వాల్సి ఉంటుంది. మార్కెట్‌లో క్వింటా పత్తి ధర కేవలం రూ.7 వేల లోపే ఉండడంతో పెట్టుబడులు వచ్చే అవకాశం లేదు. ఇలా పత్తి రైతులు ప్రకృతి దెబ్బకు చిత్తు అయ్యారు. ఇలాంటి పరిస్థితి పత్తి సాగు చేసిన రైతులకు ఎన్నడూ ఎదురుకాలేదు.

62,419 ఎకరాల్లో సాగు..

ఈ ఖరీఫ్ సీజన్‌లో ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల్లో 62,419 ఎకరాల్లో పత్తి సాగు చేపట్టారు. ఇందులో కామేపల్లి-11,596, ఖమ్మం రూరల్-10,245, ఖమ్మం అర్బన్-1,725, కూసుమంచి-8,982, నేలకొండపల్లి-3,187, రఘునాథపాలెం-13,857, తిరుమలాపాలెం -12,827 ఎకరాల్లో సాగు చేపట్టారు.

నాలుగు ఎకరాల్లో సాగు చేశా..



నాలుగు ఎకరాల్లో పత్తి సాగు చేశా. ఈ ఏడాది పత్తి సాగు అంతగా ఆశాజనకంగా లేదు. ఎకరానికి ఐదు క్వింటాళ్లలోపే దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఈ దిగుబడికి పెట్టిన పెట్టుబడులు తీరలేదు. పైగా అదనంగా రైతులకే ఖర్చవుతుంది. ఇలాంటి పరిస్థితి ఎన్నడూ రాలేదు.. చూడలేదు.

– ఉప్పుగండ్ల వీరభద్రరావు, పండితాపురం, రైతు

పెట్టుబడి వచ్చేలా లేదు..



ఏడు ఎకరాల్లో పత్తి సాగు చేశా. మొదటి దశ పత్తిని తీశాం. ఎకరాలకు నాలుగు క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చింది. ఇప్పుడు పత్తి కూడా అంతగా లేదు. ఉన్న పత్తిని తీసేందుకు కూలీలు అధిక ధర అడుగుతున్నారు. పత్తిని తొలగించి ఇతర పంటలను సాగు చేద్దామంటే సాగునారుకి అవకాశం లేదు.

-పాటి సతీశ్, పండితాపురం, యువరైతు

ధర సరిగా లేదు..



పత్తి సాగు చేసినందుకు పెట్టిన పెట్టుబడులు కూడా ఈ ఏడాది రాలేదు. ఇప్పటికే పత్తి ఎర్రబడిపోయింది. ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడంతో పాటు కూలీలకు అధిక వ్యయం పెట్టాల్సి వచ్చింది. ఉన్న పత్తికి మార్కెట్‌లో ధర సరిగా లేదు. ఏమి చేయాలో అర్థకావడం లేదు.

- ధనియాకుల వీరయ్య,పండితాపురం,రైతు

దిగుబడి తగ్గింది..



ఈ ఏడాది పత్తి దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. గతంలో ఎకరానికి 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పది క్వింటాళ్లలోపే దిగుబడి వచ్చే అవకాశం ఉంది. పత్తిని మార్కెట్‌కు నాణ్యత ప్రమాణాలు పాటించి తీసుకెళ్తే మద్దతు ధర పలికే అవకాశం ఉంటుంది.

- భూక్యా తారాదేవి, మండల వ్యవసాయాధికారి, కామేపల్లి

నియోజకవర్గాల్లో తగ్గిన పోలింగ్..



ఇందిరానగర్‌లో బారులుదీరిన మహిళా ఓటర్లు(ఫైల్)

- ఖమ్మంలో 71.43 శాతం నమోదు
- 2018లో 73.99 శాతం పోలింగ్
- పాలేరులో 90.89 శాతం నమోదు
- 2018లో 91.33 శాతం పోలింగ్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం, పాలేరు అసెంబ్లీ నియోజకవర్గాలకు గురువారం జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. రాత్రి పొద్దుపోయే వరకూ ఆయా నియోజకవర్గాల్లో పలు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు వేచి ఉండి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఖమ్మం నియోజకవర్గంలో మొత్తం 3,22,996 మంది ఓటర్లు ఉండగా.. వారిలో 2,30,724 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో పోలింగ్ 71.43 శాతంగా నమోదైంది. అలాగే పాలేరు నియోజకవర్గంలో 2,36,287 మంది ఓటర్లు ఉండగా.. 2,14,770 మంది తమ ఓటు హక్కును వియోగించుకోవడంతో పోలింగ్ 90.89 శాతంగా నమోదైంది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం నియోజకవర్గంలో 2,73,967 మంది ఓటర్లకు గాను.. 2,02,712 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా.. 73.99 శాతం పోలింగ్ నమోదైంది. పాలేరులో 2,08,544 మంది ఓటర్లకు గాను.. 1,90,470 మంది ఓటు హక్కును వినియోగించుకోగా.. 91.33 శాతంగా నమోదైంది. అయితే 2018 ఎన్నికలతో పోలిస్తే ఈ ఏడు ఖమ్మంలో పోలింగ్ 2.56 శాతం, పాలేరులో 0.423 శాతం పోలింగ్ తగ్గింది. కాగా, పురుషులతో పోలిస్తే మహిళలు అత్యధికంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఈసారి పోలైన ఓట్ల వివరాలు..

ఖమ్మం నియోజవర్గంలో..	ఓటర్లు	ఓటేసిన వారు
పురుషులు	1,54,978	1,10,103
స్త్రీలు	1,67,969	1,20,595
ఇతరులు	49	26
మొత్తం ఓటర్లు	3,22,996	2,30,724
పాలేరు నియోజవర్గంలో..	**ఓటర్లు**	**ఓటేసిన వారు**
పురుషులు	1,14,134	1,04,402
స్త్రీలు	1,22,148	1,10,366
ఇతరులు	05	02
మొత్తం ఓటర్లు	2,36,287	2,14,770

పోస్టల్ బ్యాలెట్ అందక ఓటుకు దూరం



ఖమ్మంగాంధీచౌక్: పోస్టల్ బ్యాలెట్లు అందక ఎన్నికల విధులు నిర్వహించే కొందరు ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకోలేకపోయారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులను, ఉపాధ్యాయులను ఎన్నికల విభాగం వినియోగించిన విషయం విదితమే. ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులకు ఎన్నికల కమీషన్ పోస్టల్ బ్యాలెట్ విధానాన్ని అమలు చేయగా.. ఉద్యోగులు తాము పనిచేసే శాఖ నుంచి నిర్దేశించిన ఫామ్‌లో వివరాలను పూర్తి చేసి జిల్లా ఎన్నికల అధికారి(కలెక్టర్)కు పంపించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి ఆయా ఉద్యోగులు పేర్కొన్న విధంగా తాము నివాసం ఉంటున్న ప్రాంతాల అధికారులకు పోస్టల్ బ్యాలెట్లు పంపించాలని చెప్పడంతో ఆయా ప్రాంతాలకు పోస్టల్ బ్యాలెట్ అందుతుంది. జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజక వర్గాల్లో ఎన్నికల నిర్వహణకు వివిధ ప్రాంతాల నుంచి ఉద్యోగులను నియమించారు. కొందరు ఉద్యోగులు ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాలు, మండలాలకు చెందిన వారు కాగా, మరికొందరు భద్రాద్రికొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల నుంచి ఖమ్మం జిల్లాకు కేటాయించారు. ఎన్నికల విధులు నిర్వహించిన కొందరు పీఓలు, ఓపీఓలు, ఏపీఓలకు పోస్టల్ బ్యాలెట్లు అందలేదు.

శిక్షణ రోజే ఓటేసిన కొందరు..

నవంబర్ 25న ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులకు శిక్షణనిచ్చారు. ఆ రోజే పోస్టల్ బ్యాలెట్లు శిక్షణ పొందే స్థానంలోకి కొందరి పోస్టల్ బ్యాలెట్లు అందడంతో ఆయా శిక్షణా కేంద్రాల్లోనే ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆ సమయంలో అధికారులు నవంబర్ 29 వరకు పోస్టల్ బ్యాలెట్లు అందే అవకాశం ఉందని ఉద్యోగులకు వివరించినప్పటికీ కొందరు ఉద్యోగులకు ఎన్నికల పోలింగ్ పూర్తయ్యే నాటికి కూడా పోస్టల్ బ్యాలెట్లు అందలేదు. దీంతో ఆయా ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకోలేక పోయారు. ఒక్కో నియోజకవర్గంలో 50 మంది ఆపైన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్లు అందక ఓటు హక్కును వినియోగించుకోలేకపోయినట్లు సమాచారం. మధిరలో ఎన్నికల విధులు నిర్వహించిన ఓ ఉద్యోగి మాట్లాడుతూ.. ఎంతో మంది ఓటర్లు ఓటేశాక తమ వేలుకు పెట్టిన గుర్తు(చుక్క)ను చూపిస్తుంటే.. తనకు ఓటు హక్కు ఉండి కూడా ఓటేయలేకపోవడం బాధకరమని చెప్పారు. మండల శాఖల్లో పనిచేసే కొందరు ఉద్యోగులు, దేవాదాయ శాఖ, ఉపాధ్యాయులు అనేక మంది పోస్టల్ బ్యాలెట్లు అందక ఓటు హక్కును వినియోగించుకోలేక పోయినట్లు సమాచారం.

తుమ్మలను కలిసిన మున్నూరుకాపులు



తుమ్మలను శాలువాతో సన్మానిస్తున్న కాపు సంఘం నాయికులు

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మున్నూరుకాపు సంఘం నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌పై తుమ్మల, కాపునాయకులు మాట్లాడి, ఎక్కడ ఎంతమేరకు కాంగ్రెస్‌కు ఓట్లు వస్తాయన్న దానిపై చర్చించారు. తుమ్మలను కలిసిన వారిలో మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యదర్శి శెట్టి రంగారావు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కొత్తా సీతారాములు, సముద్రాల శ్రీనివాసరావు, సీనియర్ నాయకుడు పాదిల రవికుమార్, కల్లూరి సోమనాథం, తాళ్లూరి హన్మంతరావు, గంగిశెట్టి శ్రీనివాసరావు, చొడపు నర్సింహారావు, శీలంశెట్టి వేణు, సుధా నరసింహారావు, ప్రమోద్, మధు తదితరులున్నారు.

ట్యాంక్‌బండ్‌పై తుమ్మల..

తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం సాయంత్రం ట్యాంక్‌బండ్‌కు వచ్చి వాకర్లతో కొద్దిసేపు ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపారు. చిన్నారులతో, మహిళలతో అప్యాయంగా కరచాలనం చేసి పలకరించారు. ఈ సందర్భంగా పలువురు తుమ్మలతో మాట్లాడుతూ.. మీరు మంచి మెజార్టీతో గెలుస్తారని ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. తుమ్మల వెంట కాంగ్రెస్ నాయకులు సాధు రమేశ్‌రెడ్డి, తుపాకుల యలగొండలస్వామి, సురేశ్ తదితరులున్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ గెలుపు ఖాయం



మాట్లాడుతున్న మల్లిబాబుయాదవ్

కామేపల్లి: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పండితాపురం గ్రామంలో ఆయన మాట్లాడారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డి నాయకత్వంలో జిల్లాలో పదికి పది స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకోబోతుందన్నారు. ఎగ్జిట్ పోల్స్ సర్వేలు సైతం రాష్ట్రంలో కాంగ్రెస్ అధిక అసెంబ్లీ స్థానాలు గెలవబోతుందని తెలిపాయన్నారు. తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలను బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని, దీంతో ప్రజలు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు ద్వారా బీఆర్ఎస్ బుద్ధి చెప్పారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బానోత్ నర్సింహానాయక్, ధరావత్ లాలు, భూక్యా నాగేంద్రబాబు, పాటిబండ్ల ప్రసాద్, మేకల మల్లికార్జున్‌రావు, లక్ష్మీనారాయణ, దేరంగుల తిరుపయ్య, బండి ఉపేందర్, నాగరాజు, చల్ల మల్లయ్య, నాగేశ్వరరావు, భిక్షం, తదితరులు పాల్గొన్నారు.

కష్టానికి ఫలితం రాబోతోంది..

కూసుమంచి: పాలేరు నియోజకవర్గంలో గత పదేళ్లగా ఎటువంటి అధికారం లేకపోయినా పార్టీనే నమ్ముకుని పార్టీ అభివృద్ధికి పాటుపడిన కార్యకర్తలకు తగిన ఫలితం దక్కబోతుందని టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల కోసం కార్యకర్తలు రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి పాలేరులో పొంగులేటి శ్రీనివాసరెడ్డి గెలుపునకు కృషి చేసిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

చికిత్స లేదు.. నివారణే మార్గం..

మహమ్మారి ఎయిడ్స్‌కు చికిత్స లేదు.. నివారణే మార్గమని పలువురు వక్తలు తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం నగరంలోని డీఆర్ఎస్, కవిత డిగ్రీ కళాశాలల్లో అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు. – ఖమ్మం స్పోర్ట్స్



డీఆర్ఎస్‌లో అవగాహన కల్పిస్తున్న నిపుణుడు



కవిత డిగ్రీ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పలు సబ్ స్టేషన్ల అధికారులు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. టౌన్-2 పరిధిలోని 11 కేవీ మైక్రోవేవ్ ఫీడర్ నిర్వహణ పనులు కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు బస్‌డిపో రోడ్, మయూరిసెంటర్, వడ్డెర కాలనీ, మజ్దూర్ కాలనీ, లెనిన్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-2 ఆపరేషన్స్ ఏఈ నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

టౌన్-3 పరిధిలో..

నగరంలోని ఇల్లెందు క్రాస్ రోడ్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్లకు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కవిరాజ్‌నగర్, కోర్టు ఏరియా, బైపాస్ రోడ్, న్యూ విజన్ స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు టౌన్-3 ఆపరేషన్స్ ఏఈ బి.తావుర్యా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఏఈలు కోరారు.

ఓటు హక్కు కోల్పోయిన 30 మంది సిబ్బంది

రఘునాథపాలెం: అధికారుల మధ్య సమన్వయ లోపంతో మండలంలోని 30 మంది పంచాయతీ సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకోలేదు. కొంతమంది పంచాయతీ సిబ్బంది ఎన్నికల విధులకు అవసరం ఉంటుందని.. వారికి పోస్టల్ బ్యాలెట్ ఇవ్వడానికి వారి జాబితా పంపాలని ఎన్నికల అధికారుల నుంచి మండల ఎంపీఓకు సమాచారం వచ్చింది. దీంతో మండల పరిషత్ నుంచి 30మంది సిబ్బంది పేర్లను పంపారు. తర్వాత పంచాయతీ సిబ్బందిని ఎన్నికల విధులు అప్పగించితే పంచాయతీలో పనులకు అందుబాటులో ఉండాల్సి వస్తుందని భావించి విధుల నుంచి మినహాయింపు ఇచ్చారు. అయితే వారికి ఎన్నికల విధులు లేకపోవడంతో తమ ఓటు నేరుగా పోలింగ్ బూత్‌లోనే వేయొచ్చని గురువారం పోలింగ్‌లో ఓటు వేసేందుకు వెళ్తే అక్కడ పోస్టల్ బ్యాలెట్ ఇచ్చినట్లు ఎన్నికల అధికారుల ఓటర్ల జాబితాల్లో ఉండడంతో ఓటేయకుండా వెనుదిరిగారు. తర్వాత వెంటనే సిబ్బంది మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా విధులు డ్యూటీ వేయకపోవడంతో పోస్టల్ బ్యాలెట్ ఇచ్చినట్లు తనకు తెలియదని, పై అధికారులతో మాట్లాడుతానని సిబ్బందికి చెప్పారు. ఎలాగైనా తమ ఓటుకు అవకాశం కల్పించాలని పంచాయతీ సిబ్బంది వేడుకుంటున్నారు.

ఓట్ల మొగ్గుపై పార్టీ నేతల లెక్కలు..!



రఘునాథపాలెం: మండలంలో 39,822 ఓటర్లు ఉండగా.. అందులో ఉన్న మేజర్ పంచాయతీల ఓటర్ల తీర్పుపైనే మెజార్టీ ఆధారపడి ఉంటుందని ప్రధాన పార్టీలు లెక్కలు వేస్తున్నాయి. గురువారం జరిగిన పోలింగ్‌లో మొత్తం ఓట్లలో 71.53 శాతం పోల్ అయినట్లు అధికారులు ప్రకటించగా.. అందులో ప్రతీ ఓటుకు చెల్లించిన డబ్బులకు తగ్గట్లుగా ఓట్లు పడ్డాయా లేదా అనేదానిపై బూత్‌ల వారీగా లెక్కలు వేస్తున్నారు. పంపకాల్లో కూడా ఒక పార్టీ ఇచ్చిన దాని కంటే మరో పార్టీ పెంచి పంపకాలు చేసినట్లు దాంతో ఓటర్లు క్రాస్ ఓటింగ్ చేశారా అనే దానిపై ఆశగా లెక్కలు వేస్తున్నారు. కొన్ని పంచాయతీల్లో పార్టీల అభ్యర్థులు ఇచ్చిన తాయిలాలతో పాటు స్థానికంగా ఉన్న నాయకులు ఓటు బ్యాంక్ కోసం పోలింగ్‌కు ముందురోజు చికెన్, మద్యం సైతం పంపకాలు చేసినట్లు తెలిసింది. ప్రధానంగా మండలంలోని రఘునాథపాలెం, వీవీపాలెం, మంచుకొండ, బూడిదంపాడు, చిమ్మపుడి, పంగిడి, రాంక్యాతండా పంచాయతీల్లో ఓటర్లు ఎక్కువగా ఉండగా.. ఏ సామాజిక వర్గం నుంచి ఎక్కువ ఓట్లు పోల్ అయ్యాయనే అంశాలపై ఆరా తీస్తున్నారు. త్వరలో రానున్న పంచాయతీ, ఎంపీటీసీ ఎన్నికల్లో ఈ లెక్కలు ఉపయోగపడుతుందనే భావనలో గట్టిగానే కృషి చేశారని చెప్పొచ్చు. ఆదివారం లెక్కించితే గాని బూత్‌ల వారీగా తమ ఓట్లు వివరాలు వెలుగులోకి వస్తాయని, అప్పుడు ఎంతమేర సక్సెస్ అయింది.. వారి జాతకాలు బయటపడే అవకాశం ఉంది.

రెండు చోట్ల ఓటేసిన కొందరు..



కామేపల్లి: గ్రామాల నుంచి పట్టణాలకు వెళ్లిన కొందరు సొంత గ్రామాల్లో ఓటు ఉన్నప్పటికీ వారు ఉంటున్న ప్రాంతాల్లో సైతం ఓటు హక్కు కోసం నమోదు చేసుకున్నారు. దీంతో అధికారులు వారికి ఓటు హక్కును కల్పించడంతో వారు రెండు చోట్ల ఓటు హక్కు వినియోగించుకున్నారు. చేతికి సిరా చుక్క ఉన్నప్పటికీ దాన్ని తొలగించి మరోచోట ఓటేశారు. ఇలా చాలా మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు సమాచారం.